ఓం నమోభగవతే శ్రీ రమణాయ

# ఉమా సహస్రము

## (ద్వితీయ శతకమున – తృతీయ స్తబకము)

## సప్తమ స్తబకము

మూ॥ వాణీసరోరుహదృశో హయరాజహంసో
వక్త్రా రవిన్దనిలయాద్ బహిరాగతాయాః।
ఆలాపకాల దరహాస ఇహస్థితానామ్
క్షేమం కరోతు సుతరాం హరసున్దరీయః॥ 1

(ఉమ యొక్క) ముఖారవిందనిలయము నుండి వెలువడిన వాణీ సరోజనయన యొక్క హయరాజహంసమగు శివకాంతాలాపకాలదర హాసము – భూలోకమునందున్న జంతువులకు – సమధికమగు క్షేమమును ఘటించుగాత!

**ప్రభ:**- ముఖారవింద నిలయమనఁగా, ముఖపద్మమే యగు నివాసము, వాణీ సరోజనయనయనఁగా సరస్వతియనెడి సుందరి. పద్మ సంభవుఁడగు బ్రహ్మ యొక్క సుందరియగు సరస్వతికి వాహనము హంసమనునది ప్రసిద్ధము. పద్మసంభవునకు జన్మస్థలమగు అరవిందము సరస్వతికిఁగూడ నివాసస్థలము కాకతప్పదు. కావున లక్ష్మీ జన్మస్థానమగు పద్మము సరస్వతీ వాసస్థాన మెట్లగునను శంక కవకాశము లేదు. ఇచట సమానధర్మమగు తెల్లఁదనము వలన రాజహంస – దరహాసములకు రాజహంసమే – దరహాసమని తాదాత్మ్యము. అధ్యవసితము. కావున వ్యస్తమగు రూపక మలంకారమగుచున్నది. మఱియు వాణీ సరోజనయనయొక్క బహిరాగమనమునకును – ఉమాలాపమునకును తాద్రూప్యము. అనగా సరస్వతి బయలువెడలుటయే



ఉమాలాపమని చెప్పఁబడినది. ఇది – సమా సార్ధగతమగు, వైయధికరణ్యము చేత (భిన్న విభక్తులతో) చెప్పఁబడినది. కావున నిదియు వ్యస్తమగు తాద్రూప్యరూపకమే యగునని గ్రహించునది. భగవతీ మందహాసము వాక్కును వహించుచున్నదనునది భావము.

మూ॥ నాదో ఽసి, వాగసి, విభాసి చిదస్యఖణ్డా
ఖణ్డీభవన్త్యపి చిదస్యఖిలేఽన్త కాన్తే।
తత్తాదృశీం నిఖిలశక్తిసమష్టిమీశే
త్వామన్తరిక్షపరిక్లుప్తతనుం నమామి.॥ 2

సర్వేశ్వర సుందరివగు నోయీశ్వరీ! నీవు నాదమవు, వాణివి, జ్యోతివి, అఖండచిత్ స్వరూపిణివి. అయినను ఖండీభవచ్చిత్ స్వరూపిణివి గూడ నగుచున్నావు. కావున సర్వశక్తి సమష్టిస్వరూపవును ఆకాశమునందు సిద్ధమగు శరీరము గలదానవును అగుచున్నావు. అట్టినీకు నమస్కరించుచుందును.

**ప్రభ:**- కారణావస్థమును, ప్రణవరూపమును అగు శబ్దము నాదము. కార్యరూపమును, అభివ్యక్తమును అగు శబ్దము వాక్కు, అఖండచిత్ స్వరూపిణివనఁగా భేదరహిత ప్రజ్ఞవని యర్థము. ఖండీభవచ్చిత్ స్వరూపిణివనఁగా, అనేక ఖండములయిన చిత్తులుకూడ నీచిద్రూపము లేయని భావము.

అవ్యక్త – నాదాత్మవగు నీకు వ్యక్తనాదాత్మకతవలె, అఖండ చిత్తువగు నీకు ఖండ చిద్రూపత్వముకూడ కలదని భావము. 'కావున' అనఁగా సకలలోక నిర్మాణ సమర్థములగు నాద – వాగ్– విభా– ఖండ– అఖండ– చిద్రూపములు గలుగుట వలన అని యర్థము. సర్వశక్తి సమష్టి స్వరూపవనఁగా నానాశక్తి సంహతి స్వరూపిణివని యర్థము. ఆకాశమునందు సిద్ధమగు శరీరము గలదాన వనఁగా నాద – జ్యోతిర్మయ స్వరూపమున అంతరిక్షమున వ్యాపించినదానవని భావము.

స్త్రీ వేషవు – పరిచ్ఛిన్న శరీరవు అగు నిన్నిచట స్తుతించుచున్నాను. అయినను నీ స్వరూపము జ్యోతిర్మ్నాదమయము – సర్వవ్యాపకము అని యెఱుఁగుదును. కావున అట్టి స్వరూపముగల నీకే నమస్కరింతునని తాత్పర్యము.

మూ॥ విశ్వ ప్రసిద్ధ విభవాస్త్రిషు విష్టపేషు
యాః శక్తయః ప్రవిలసన్తిపరః సహస్రాః
తాసాం సమష్టిరతిచిత్ర నిధాన దృష్టిః
సృష్టి-స్థితి - ప్రలయ - కృద్, భువనేశ్వరి ! త్వమ్. 3

భువనేశ్వరీ! భూలోక – భువర్లోక–స్వర్లోకములయందు బ్రహాండ విశ్రుత విభవములును, పరసహస్రములును అగు ఏ శక్తులు విరాజిల్లుచున్నవో, ఆ శక్తుల యొక్క సమష్టియే స్వరూపముగాఁ గలిగిననీవు – అత్యద్భుత నిధానదృష్టివి. సృష్టి – స్థితి – ప్రలయకారిణివి.

**ప్రభ:**- భువనేశ్వరి యనఁగా లోక రాజ్ఞియని యర్థము. విభవములనఁగా సామర్థ్యరూపములగు నర్థములు. పరస్సహస్రములనఁగా సహస్రాధికములు. సృష్ట్యాదులయం దధికృతములగు విశ్వ ప్రసిద్ధ శక్తులన్నియుఁగూడ నీ యొక్క తెయందే సమసించుట వలన నీవు శక్తి సమష్టి స్వరూపవు. సర్వసృష్టి సామగ్రీని క్షేపభూతమగు నిధానము నీ దృష్టి యందే యుండుట వలన నీవు అతిచిత్ర నిధానదృష్టివి. సర్జన – రక్షణ. సంహారములు నీయధీనమునం దుండుటవలన నీవే సృష్టిస్థితి ప్రలయ కారిణివి అని భావము. '' నీ స్వరూపము కేవలమగు స్త్రీరూపము చేత పరిచ్ఛిన్నము ( ఖండస్వరూపము గలది) కాదు'' అని తాత్పర్యము.

మూ ॥ జానేనయత్తవ జగజ్జనయిత్రి! రూపం
సఙ్కల్ప్య తేకిమపి తన్మనసోబలేన।
సఙ్కల్పితస్య వపుషః శ్రితశోకహన్త్రి!
విన్యస్యతే తవవ చోతిగ ధామనామ. ॥ 4



ఓ జగజ్జనయిత్రీ! నీ రూపమేదో నేనెఱుఁగను. కనుకనే ఆరాధన కొఱకు నామనోబలము చేత ఏదో రూపమును కల్పించుకొనుచున్నాను. ఓ యాశ్రితశోకహన్త్రీ! ఇట్లు భావనా కల్పితమగు నీ రూపమునకొక పేరు కూడ పెట్టుకొన్నాను. ఆ నామము – వచోతిగధామము.

**ప్రభ:**- జగజ్జనయిత్రి యనఁగా లోకములను గన్నతల్లి. మనో బలమనఁగా భావనాబలమని గ్రహించునది. ఆశ్రితశోకహన్త్రి యనఁగా, ఆశ్రయించిన ప్రజల దుఃఖములను తొలఁగించునది. ' ఆనామము' అనఁగా భావన చేత రచింపఁబడిన రూపము గల తల్లిని దెలుపుటకై ప్రయోగింపఁబడిన ' ఉమ' అను పేరు. 'వచో ఽతిగ ధామము' అనఁగా, మాటలకందని ప్రభావముగలదియని యర్థము.

అమ్మా! నీయథార్థస్వరూప పరిజ్ఞానము లభింపకుండుట వలన భావనా బలము చేత కల్పించిన రూపము మితమేయయినను, పెట్టుకొన్న నామము యొక్క ప్రభావము మాత్రము వాచామగోచరమని భావము.

మూ॥ కామం వదన్తు వనితామితిహాసదక్షాః
త్వాం సర్వలోక జనయిత్రి! సదేహబన్ధామ్।
సత్యంచ తద్ భవతు సాతవకాఽపిలీలా
దివ్యం రజస్తు తవ వాసవ్తికం శరీరమ్.॥ 5

ఓ సర్వభువన ప్రసూ ! ఇతిహాసదక్షులగు పండితులు వారి యభీష్టము ననుసరించి నిన్ను సదేహబంధవగు స్త్రీవని చెప్పనీ. ఆ చెప్పినది సత్యమునుకానీ, అది ( ఆ విగ్రహరూపము) నీకొకానొక లీల మాత్రమే. నీకు వాస్తవికమగు శరీరము దివ్యమగు ( రజస్సే) సూక్ష్మ రేణువేయగును.

**ప్రభ:**- ఇతిహాసదక్షులనఁగా పురావృత్త కథాకుశలులు.

ప్రశ్న – పరమేశ్వరి స్త్రీ విగ్రహవతి యగుట సత్యమా?

ఉత్తరము – సర్వశక్తి యుక్తయగు పరమేశ్వరి – స్త్రీ విగ్రహవంతురాలగుట లోకానుగ్రహ నిమిత్తకమగు విలాసవిశేషము కావచ్చును.

ప్రశ్న – పరమేశ్వరికి వాస్తవికమగు శరీరమేది?

ఉత్తరము – ఆకాశగతమగు (రజస్సే) సూక్ష్మ రేణువే యామె శరీరము. భగవతియగు నమకు వాస్తవిక శరీరము. ''సాతత్త్వతః సమన్తాత్'' ఇత్యాదిశ్లోకముల యందు ప్రథమ శతకమున ప్రతిపాదింపఁబడి వ్యాఖ్యానింపఁబడియున్నది.

మూ॥ భూజన్మపాంసుభిరగర్హి తశుద్ధరూపా
యాకాశ ఉపి పాంశుపటలీ విపులేఽన్తరక్షే।
సాతేతనుః సుమహతీవరదే! సుసూక్ష్మా
తామేవ దేవసరణిం కథయన్తి ధీరాః॥ 6

అభీష్టవరదాత్రివగు జననీ! భూమినుండి జనించిన ధూళుల చేత దూషితము కాని శుద్ధమగు ఒకానొక పాంశుపటలి (రేణుసంహతి) విశాలమగు నీయంతరిక్షమునందున్నది. ఆయాకాశముకంటెను గూడ మిగుల పెద్దదియు, అన్నిటికంటెను గూడ మిక్కిలి సూక్ష్మమైనదియునగు నారేణుసంహతి – నీ శరీరమగుచున్నది. ధీరుల గువిజ్ఞులు – ఆకాశగతమగు ఆపాంశుపటలినే దేవసరణి (దేవయానమార్గము) అని చెప్పియున్నారు.

**ప్రభ:**- (పార్థివ) – భౌతిక సంపర్క శూన్యమును, స్వతః సిద్ధమును, స్థూలమగు బుద్ధిచేతను, ఇంద్రియముల చేతను దెలియఁబడనిదియును, యోగిజనుల సూక్ష్మములగు దృష్టులకు మాత్రమే గోచరించునదియునగు ఆకాశగత సూక్ష్మాణుపటలియే ఉమాశరీరమని గ్రహింపనగును.



ధీరులనఁగా ప్రశస్తమగు బుద్ధిని గ్రహించినవారు, దేవయానమార్గమనినను అర్చిరాది మార్గమనినను ఒక్కటియే. ఈ మార్గమున శరీరము నుండి యుత్క్రాంతుఁడగు విద్వాంసుడు – ఊర్ధ్వగతి నొందునని శ్రుతులయం దుగ్గడింపఁబడినది.

**అవ:**- దేవయానాత్మకమగు పరమేశ్వరీ శరీరమును మరల వివరించున్నాఁడు.

మూ॥ యాదేవి! దేవసరణిర్భవమగ్నదుర్గా
వైరోచనీతికథితా, తపసాజ్వలన్తీ,।
రాజీవబన్ధుమహసా విహితాఙ్గరాగా,
సాతే తనుర్భవతి సర్వసుపర్వవర్ణ్యే॥ 7

సర్వసుపర్వవర్ణ్యవగు దేవి! జనన మరణ రూపమగు సంసారమను సముద్రమున మునిఁగిన వారికి దుర్గమమగు దేవసరణి– తపస్సు చేత జ్వలించునదియై వైరోచనియని చెప్పఁబడినది. వైరోచనియగు అదేవసరణియే – కమలబంధువగు సూర్యుని తేజస్సు చేత రచితమగు నంగరాగము గల నీ శరీరమగుచున్నది.

**ప్రభ:**- సంసార నిమగ్నులకు దుర్గమమని చెప్పఁబడిన దేవసరణి– విద్వదేక గమ్యము. తపస్సనఁగా, స్వాత్మయందుంచఁబడిన దృఢమగు దృష్టియొక్క బలము.

''విశేషేణరోచతే ఇతి విరోచనః'' అను వ్యుత్పత్తి చేత విశేషించి ప్రకాశించువాఁడగు సూర్యుఁడు విరోచనుఁడని చెప్పఁబడుచున్నాడు. జ్వలత్ ప్రకాశుఁడగు సూర్యుఁడు సర్వేశ్వరుడు, తత్ సంబంధినియగు దేవసరణి – వైరోచనియని చెప్పఁబడినది. దుర్గయు వైరోచనియునగు భగవతిని క్రిందిమంత్రమెట్లు గానముచేయుచున్నదో చూడుఁడు.

''తామగ్ని వర్ణాం తపసాజ్వలన్తీంవైరోచనీం కర్మఫలేషు జుష్టాం దుర్గాం దేవీం శరణమహంప్రపద్యే సుతరసి తరసేనమః''

ఈలోకమునుండి యుత్క్రమించిన విద్వాంసుని స్వర్లోకమునకు గొనిపోవునదియు, దివ్య రజఃపటలము చేత నిండియున్నదియు, దేవయానమను పేరుగలదియునగు అర్చిరాదిమార్గము దేవీశరీరమని చెప్పఁబడినది.

అంతరిక్షగతమగు దివ్య రజోరూప దేవీ శరీరమునకు ప్రభాకర తేజస్సుచేత, అంగలేపము సంఘటింపఁబడినదని, తేజోఽంగరాగములకు తాదాత్మ్యము సంభావింపఁబడుట చేత ఇది గమ్యోత్ప్రేక్షయా, లేక

విషయ – విషయులగు తేజోఽంగరాగములలో విషయమగు తేజస్సును మరుగుపరచుట చేత విషయియగు అంగరాగము యొక్క అధ్యవసానము వలన అతిశయోక్తియా అను సందేహము కల్గెడిని. కావుననిది – తత్ సందేహ సంకరమగును.

మూ॥ ప్రాణా స్తవాత్ర హృదయం చవిరాజతేఽ త్ర
నేత్రాణి చాత్రశతశః శ్రవణానిచాత్ర।
ఘ్రాణానిచాత్ర రసనాని తథాత్వచశ్చ
వాచోఽత్రదేవి! చరణానిచ పాణయోత్ర॥ 8

దేవీ! దివ్య రేణుమయమనియు, దేవయానాఖ్యమనియు వెనుక చెప్పఁబడిన నీ శరీరమగు అర్చిర్మార్గమునందు జగజ్జీవనధారణ హేతు భూతములగు ప్రాణములును జ్ఞాన – క్రియా విలాస మూలమును, ఆత్మస్థానమును అగు ప్రాణుల హృదయమును, అసంఖ్యాకములగు వారి నేత్రములును, శ్రవణములును, ఘ్రాణములును, రసనములును, త్వక్కులును, వాక్కులును, చరణములును, పాణులును విరాజిల్లుచున్నవి.

**ప్రభ:-** పాణి – పాద – వాక్ – ప్రాణ – చక్షుః శ్రోత్రాదులగు సమస్త కర్మ జ్ఞానేంద్రియముల సమష్టి – ఈ జగజ్జనని దివ్య రేణుమయి శరీరమునందే యున్నదని చెప్పఁబడియెను. హృదయమున కేకవచనమును, వాక్ప్రాణాదులకు బహువచనమును ప్రయోగింపఁబడినవి.



ఇట్లు ప్రయోగించుట చేత వ్యష్టిగతములగు వాగాదులనేకము అయినను ఈ సర్వవ్యష్టులకును మూలమును, ఆత్మస్థానమును అగు హృదయము ఒక్కటియే అను నంశము వివక్షితము. తన చేత నుపని బంధింపఁబడిన శ్రీరమణగీతయందు హృదయమును గురించి మహర్షి కావించిన యుపదేశము నీయాచార్యుఁడిట్లుగ్గడించుచున్నాఁడు గదా!

శ్లో. ''అణ్డం వపుషి నిశ్శేషం, నిశ్శేషం హృదయే వపుః
తస్మాదణ్డస్య సర్వస్య హృదయం రూపసఙ్గ్రహః''

సంపూర్ణమగు బ్రహ్మాండము, (భగవతి యొక్క) శరీరమునందున్నది. ఆ శరీరమంతయు (ఆమెయొక్క) హృదయమునందున్నది. కావున బ్రహ్మాండమున కంతకును హృదయమే – రూప సంగ్రహము. (సూక్ష్మమగు మూలము) వాక్ ప్రాణచక్షురాదులన్నియుఁగూడ, పరమేశ్వరి శరీరమునందున్న వనుటవలన– ఇవి యన్నియు గూడ స్థూల – సూక్ష్మ కారణావస్థలు మూడింటియందును తదనన్యములు (ఆమెకంటే వేఱు కానివి). తదుపాదానములు (ఆమెనుండియే జనించినవి.) తదాధారములు (ఆమెయే ఆధారము గాఁగలవి) అనునర్థము ప్రతిపాదింపఁబడినదని గ్రహించునది.

మూ॥ సర్వత్రపశ్యసి, శృణోషిచ, సర్వతోఽప్యు
సర్వత్రఖాదసి, విజిఘ్రసి, సర్వతోఽపి
సర్వత్రచ స్పృశసి, మాతరభిన్నకాలే
కః శక్నుయాన్ని గదిన్ని గదితుంతుంతవదేవి! భాగ్యమ్॥ 9

సార్వకాలికవగుటచే నిత్యవగునోదేవి! నీవే అంతటను చూచున్నావు. అన్నిటను వినుచున్నావు. అంతటను భుజించుచున్నావు. అన్నిటను మూర్కొనుచున్నావు. అంతటను స్పృశించుచున్నావు. తల్లీ! నీ భాగ్యమును చెప్పుటకు సమర్థుఁ డెవడున్నాఁడు.

**ప్రభ:**- కడచినది, రాఁబోవునది, జరుగుచున్నది అనుభేదము చేత త్రివిధమగు కాలము లేకుండుట వలన నీవు కాలపరిచ్ఛేదము లేనిదానవను నర్థము 'అభిన్నకాలే' అనుపదముచేఁ దెలుపఁబడినది.

నీకన్నే – అన్నింటికిని కన్నెయుండుటవలన అంతటను జూచుదానవు నీవే యగుచున్నావు. ఇట్లే తదితర స్థలములం దెఱుంగునది. మఱియు'చక్షుషఃచక్షుః శ్రోత్రస్యశ్రోత్రమ్'. ఇత్యాదిగా శ్రుతులయందు బ్రసిద్ధవగు నీవు ఈ ప్రాణులచక్షుస్సులకు చక్షుస్సును, శ్రోత్రములకు శ్రోత్రము మొదలగునవి యగుదువు. కావున నీవే చూచుదానవు, వినుదానవు, భుజించుదానవు, మూర్కొనుదానవు, స్పృశించు దానవు అగుదువని యైనను జెప్పనగును.

ఇట్లంతటను జ్ఞానేంద్రియ రూపము నుండి వ్యాపారముల నొనర్చుచున్న నీయైశ్వర్యము నుగ్గడించుటకు శక్తుఁడగువాఁడింకొకఁడు లేఁడని భావము.

మూ॥ సర్వత్ర నన్దసి, విముఞ్చసి సర్వతోంబ!
సర్వత్ర, సంసరసి, గర్జసి, సర్వతోఽపి,
సర్వత్రదేవి! కురుషే తవ కర్మజాల
వైచిత్ర్యమీశ్వరి! నిరూపయితుం క్షమః కః? 10

ఈశ్వరీ! అంతటను ఆనందస్వరూపిణి వగుట వలన నీవే యానందించుచున్నావు. అన్నిటివలనను విడుచు చున్నావు, అంతటను సంచరించుచున్నావు. అన్నిటి మూలమునను గర్జించుచున్నావు, అన్నిటి మూలమునను గూడ (పని) చేయుచున్నావు. నీ కర్మజాలవైచిత్ర్యమును నిరూపించుట కెవఁడు సమర్థుఁడు?

**ప్రభ:**- మీది శ్లోకమునందలి 'సంసరసి' అను పదమునకు సందర్భము ననుసరించి, సంచరింతువు అనునర్థము చెప్పఁబడినది.



ఇందు గర్జించుట వాగింద్రియ వ్యాపారము. చేయుట పాణీంద్రియ వ్యాపారము. సంచరించుట పాదేంద్రియ వ్యాపారము. విడుచుట పాయ్వింద్రియవ్యాపారము. ఆనందించుట ఉపస్థేంద్రియ వ్యాపారము. అని యెఱుంగునది.

మూ॥ విశ్వామ్బి తే! త్వయి రుచాంపతయః కియన్తో?
నానావిధాబ్ధికలితా, క్షితయః కియత్యః?
బిమ్బాని శీతమహసాం లసతాంకియన్తి?
నైతత్ప్రవేద, యది కో విబుధో బహుజ్ఞః? 11

ఓ విశ్వజననీ! ఆధారభూతవగు నీయందు సూర్యులెందఱున్నారో, లవణేక్షు సురాదిసముద్ర వలయితములకు దేశములెన్ని కలవో, ప్రకాశించుచున్న చంద్రమండలము లెన్నికలవో, ఈయంశమును గూడ తెలియని యెడల బహుజ్ఞుఁడగు విబుధుఁ డెవఁడున్నాఁడు?

**ప్రభ:**- ఒక్కొక్క సూర్య కుటుంబమునకు నక్షత్రస్వరూపమున నున్న సూర్యులనేకులు మూలభూతములగు భూములైయున్నారు. వారి నాశ్రయించి చంద్రులనేకులు సంచరించుచున్నారు. ఈ యర్థమును, ప్రథమశతకమునందలి ద్వితీయస్తబకము నందుగల 'పునర్విపాకతః' 'విసర్జనేన' అను శ్లోకములందు పరిశీలించునది. లోకులందఱును కించిద్జ్ఞులే యని భావము.

**అవ:**- తరువాత బ్రాహ్మి మొదలగు సప్తమాతృకల వైభవమును వేర్వేఱుగ నేడు శ్లోకముచేఁ దెలుపుచున్నాఁడు.

మూ॥ అవ్యక్తశబ్దకలయాఖిల మన్తరిక్షమ్
త్వం వ్యాప్యదేవి! సకలాగమసంప్రణేత్రీ! ।
నాదోఽస్యుపాధివశతోఽ ధవచాంసి, చాసి!
బ్రాహ్మీంవదన్తి కవయోఽ ముకవైభవాం త్వామ్॥ 12

సకలతంత్ర శాస్త్రసంప్రణీతవగు నో దేవీ! అవ్యక్తమగు ప్రణవము యొక్క అంశము చేత అంతరిక్షము నంతను వ్యాపించి నీవు నాదమ్మైయున్నావు. తదుపరి ఉపాధివశమువలన వాక్కులు గూడ నైయున్నావు, ఇట్లు కార్య కారణోభయవిధ వాగాత్మవమగు వైభవము గలిగియున్న నిన్ను పండితులు బ్రాహ్మీవని (బ్రహ్మశక్తివని) చెప్పుదురు.

**ప్రభ:-** అస్పష్టమును ప్రణవరూపమును నగు కారణశబ్ద స్వరూపముతో ఆకాశమునందు వ్యాపించి నాదశబ్దవాచ్యవగు నీవు కారణవాగ్రూపవై యున్నావు. తరువాత కార్యోపకరణవశమున వ్యక్తవాగ్రూపిణివగుచున్నావు. ఇట్లు కార్యకారణోభయ వాగ్రూపిణివగు నిన్ను కవులు బ్రాహ్మీవని చెప్పుదురని భావము. '' ఉపసమీపే ఆదధాతి'' అను వ్యుత్పత్తివలన ఉపాధియనఁగా, కార్యమున కుపకరణమగు వస్తువని యర్థము.

**అవ:-** పిమ్మట వైష్ణవీమాతృకను వ్యాఖ్యానించుచున్నాఁడు.

మూ॥ నానావిధైర్భువనజాల సవిత్రి! రూపై
ర్వ్యాప్త్యైక నిష్కలగభీరమహస్తరఙ్గైః।
వ్యక్తం విచిత్రయసి సర్వమఖర్వశక్తే!
సా వైష్ణవీ తవకలాకథితామునీన్ద్రై॥ **13**

జగజ్జాలజనయిత్రివగు నోయనల్పశక్తీ! వ్యాప్తము, ఏకము, నిష్కళము, గభీరము అగుజ్యోతిస్సుయొక్క తరంగములు గలిగిన బహు విథములగు రూపములచేత ప్రపంచగతమగు వస్తుసముదాయమంతయు వేర్వేరగురూపమున వ్యక్తమగునట్లు – విచిత్రముగాఁజేయు చున్నావు. ఏకళచేత నీవిట్లు చేయుచున్నావో, ఆనీ కళను తాపసోత్తములు వైష్ణవి (విష్ణుశక్తి) అని చెప్పుచున్నారు. కారణమగు జ్యోతికి కార్యావస్థయందు రూపాత్మకతాసిద్ధి ప్రసిద్ధము. వ్యక్తమగు సృష్టికి రూప సంపాదికయగు మాత విష్ణుశక్తియని తాత్పర్యము.



మూ॥ వ్యక్తిత్వమమ్బ! హృదయే హృదయే తథాసి,
యేనప్రభిన్న ఇవబద్ధ ఇవాన్త రాత్మా॥
సేయం కలా భువన నాటక సూత్రభర్త్రి!
మాహేశ్వరీతి కథితా తవచిద్విభూతిః॥ **14**

ఓ భువన నాటకసూత్రభర్త్రీ! అంబా! ప్రతి హృదయునందును వ్యక్తిత్వమును (వేర్వేరుగా నేను, నేను, అనుతలంపు గలిగియుండుటను) ధరింపఁజేయుచున్నావు. ఇట్లు వ్యక్తిత్వమును సంఘటించుట చేత, (సర్వాంతరుఁడగు ఆత్మ – ఒక్కఁడేయయినను, ప్రభిన్నుఁడు (అనేకుఁడు వలెను, నిత్యముక్తుడయినను, బద్ధుఁడువలెను అగుచున్నాఁడు. ఇట్లు భేదభ్రమ నొదవించుచున్న యేకళ చేత, అంతరాత్మ ఒక్కఁడేయయినను, అనేకుఁడువలెను అవ్యక్తుఁడయినను వ్యక్తుఁడువలెను. స్వతంత్రుడైనను, బద్ధుఁడువలెను అగుచున్నాఁడో; ఆయా నీకళయగు చిద్ విభూతి – మాహేశ్వరి (మహేశ్వరశక్తి) అని చెప్పఁబడుచున్నది.

**ప్రభ:-** నాదాత్మిక యగు వాగ్ విభూతి, బ్రాహ్మీకల' అనియు, ''విశ్వరూప స్థితి సంపాదికయగు శోభావిభూతి వైష్ణవీకళ'' అనియు కడచిన శ్లోకముయందు ప్రతిపాదించి యీ శ్లోకమునందు – అగణిత భేదభ్రమ భూయిష్ఠ జగన్నాటక సంవిధాత్రియు, హృదయస్థిత – ఈశ్వర మాయయు అగు చిద్ విభూతి 'మాహేశ్వరీకళ' అని చెప్పఁబడినది. ఇందు హృదయ – ప్రభిన్న ఇవ – బద్ధ ఇవ – భువన నాటకాది శబ్ద ప్రయోగము వలన

ఈశ్వరస్సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి
భ్రామయన్ సర్వభూతాని యన్త్రారూఢానిమాయయా॥

''యంత్రారూఢములగు ప్రాణులను మాయచేత నాడించుచు నీశ్వరుఁడు వాని హృదయదేశమునందున్నాఁడు.''

అను భగవద్గీతాశ్లోకార్థ మను సంధింపఁబడినదని యెఱుంగునది.

**అవ:**- ఇప్పుడు 'కౌమారి' అను మాతృకను దెలుపుచున్నాడు.

మూ॥ ఆహారశుద్ధివశతః పరిశుద్ధసత్త్వే
నిత్యస్థిరస్మృతిధరే వికసత్ సరోజే।
ప్రాదుర్భవస్యమలతత్త్వ విభాసికా యా
సాత్వంస్మృతాగురు గుహస్య సవిత్రి! శక్తిః॥ 15

సవిత్రీ! ఆహార శుద్ధి వశము వలన నిర్మలమగు అంతఃకరణము గలిగినదియు, స్థిరమగు ప్రజ్ఞను దరించునదియు, వికసించిన పుండరీకము (హృదయము) గలదియునగు జనమునందు శుద్ధసత్యమును ప్రకాశింపఁ జేయుచున్నదానవై యావిర్భవించుచున్న నీవు - కౌమారి (కుమారశక్తి) వని స్మరింపఁబడుచున్నావు.

**ప్రభ:**- ఆహార శుద్ధి - స్థూల రూపమునను సూక్ష్మ రూపమునను ద్వివిధమగుచున్నది. అందు దేహాశ్రితమగు నంతఃకరణమునకు సాత్త్వికాహారము చేత సంపాదింపఁబడినది - స్థూలరూపముననగు ఆహార శుద్ధి యగుచున్నది. శబ్దాదులగు విషయములకు శ్రోత్రాదులగు నింద్రియములతోడి సంయోగము గలిగినపుడు

'గుణా గుణేషు వర్తన్తే' భగవద్గీత **3** అ. **28** శ్లో.

(శ్రోత్రాదులే శబ్దాదుల యందు ప్రసరించుచున్నవి. ఆత్మ ప్రవర్తించుట లేదు.)

'' ఇన్ద్రియాణీన్ద్రియార్థేషు'' భగవద్గీత **5**అ. **9** శ్లో.

( ఇంద్రియములగు శ్రోత్రాదులే. ఇంద్రియార్థములగు విషయములందు వర్తించుచున్నవి. ఆత్మనగు నేనేమియుఁ జేయుటలేదు.)

అని వ్యవసాయాత్మికయగు బుద్ధిచేత, వినుట, చూచుట మొదలగు ప్రకృతి వ్యాపారముల కంటె ఆత్మను వేరుగా నెఱింగి మెలఁగువానికిఁ గలుగునది - సూక్ష్మ రూపముననగు నాహారశుద్ధి యగుచున్నది. ఆహరించుటయన స్వీకరించుట అని



యర్థము. కావున ఆహ్రియమాణములు = స్వీకరింపబడినవి అగు విషయములు - 'ఆహారము' అని చెప్పఁబడును. కావున రాగాదులతోడి సంబంధము లేకుండునట్లు గ్రహింపఁబడుచున్న విషయముల యొక్క శుద్ధి - ఆహార శుద్ధియని ఇచటఁ జెప్పబడినది. గురుగుహుఁడనఁగా కుమారుఁడు (స్కందుఁడు).

ఛాందోగ్య శ్రుతియందుఁగల నారద సనత్కుమారాఖ్యాయిక యందీయంశమిట్లు చెప్పఁబడినది. '' ఆహారశుద్ధి కలుగునపుడు అనఁగా, శబ్దాది విషయ విజ్ఞానము రాగద్వేష మోహ దోషసంస్పృష్టముకానపుడు అంతఃకరణ శుద్ధికలుగును, అంతఃకరణము శుద్ధమగునపుడు తెలియఁబడిన భూమస్వరూపమగు నాత్మయందు ధ్రువమగు (అవిచ్ఛిన్నమగు) స్మృతి (మరపులేమి) కలుగును. స్మృతి కలుగునపుడు హృదయాశ్రయములగు సర్వ గ్రంధులును విడిపోవును. (సత్యము స్ఫురించును) అని మృదితకషాయుఁడగు (దోషరహితుఁడగు) నారదునకు భగవానుఁడగు సనత్కుమారుఁడు తమస్సున కావలనున్న పరమార్థ తత్త్వమును చూపించెను. అసనత్కుమారునే స్కందుఁడని తద్విదులు చెప్పుదురు.'' ఇట్లు ఛందోగులు- స్కందుఁడు- సనత్కుమాఁరుడు- ఒకఁడేయని చెప్పుచున్నారు.

ఇట్లు ఆహార శుద్ధి వలన నిర్మలాంతః కరణులకు మనుష్యులకు తన్మూలమున ధ్రువమగు స్మృతి కలుగునపుడు వారి హృదయముల యందు పరమేశ్వరి శక్తి చేత నిర్మలమగు సత్యము ప్రకాశింపఁజేయఁబడునను నీ యంశము కుమారునిచేఁ దెలుపబడుట వలన నాశక్తి - కౌమారి (కుమారశక్తి) అని ప్రవచింపఁబడిన' దని గ్రహించునది.

**అవ :**- పిమ్మట ''వారాహి'' అను మాతృకను స్తుతించుచున్నాడు.

మూ॥ హవ్యం యయా దివిషదో మధురంలభన్తే
కవ్యం యయా రుచికరం పితరో భజన్తే
అశ్నాతిచాన్నమఖిలోఽపి జనోయయైవ
సాతే వరాహవదనేతి కలామ్బ! గీతా. 16

అమ్మా! దేవతల చేత మధురమగు హవ్యమును గ్రహింపఁజేయునదియు, పితరులచేత రుచికరమగు కవ్యమును స్వీకరింపఁజేయునదియు, సర్వజనుల చేతను గూడ అన్నమును భుజింపఁజేయునదియు నగు; నీ కళ- వరాహవదన (వారాహి) అని గానము చేయఁబడినది.

**ప్రభ:-** దేవతలకొఱ కీయఁబడు నన్నము - హవ్యమనియు, పితృదేవతల కీయఁబడునన్నము - కవ్యమనియు చెప్పఁబడును ''హవ్యకవ్యే దైవపైత్రే అన్నే'' అని అవురవు గదా! సర్వమును భుజించునదియు (భోక్త్రియు) భుజింపఁజేయునదియునగు నీ కళ - వారాహి, దీని చేతనే దేవతలు, పితరులు, మనుష్యులు కూడ భోజన సామర్థ్యవంతులుగాఁ జేయబడుచున్నారని భావము.

**అవ:-** అనంతరము '' ఇంద్రాణి'' అను మాతృకను స్తుతించుచున్నాడు.

మూ॥ దుష్టాన్ నిహంసి జగతామవనాయ సాక్షా
దన్యైశ్చ ఘాతయసి తప్తబలైర్మహద్భిః
దమ్భో విచేష్టిత పరీక్ష్య బలాబలారేః
శక్తిర్న్యగాది తవ దేవి! విభూతి రేషా. 17

దేవీ! లోకమును రక్షించుటకు నీవు స్వయముగానే దుష్టులను చంపుచున్నావు. ప్రతప్తబలులును; మహాసత్త్వులునునగు నితరులచేత గూడ చంపించుచున్నావు. ఇట్లు చేయుచున్న నీవిభూతి - వజ్రాయుధము యొక్క చేష్టితముచేత పరీక్షింపఁదగిన బలముగలదై ఇంద్రాణి ( ఇంద్రశక్తి) అని పేర్కొనఁబడుచున్నది.

**ప్రభ:-** దుష్టులను స్వయముగా నిగ్రహించునదియు, ఇతరులచేత నిగ్రహింపించునదియునగు మాతృ విభూతి - ఇంద్రాణి అని తాత్పర్యము. ఈశక్తి యొక్క బలనిర్ణయమున పరీక్షకము వజ్రాయుధమే యగును. అది బలారియగు నింద్రునికి సంబంధించినది. కావున నీశక్తి ' ఇంద్రాణి' అని పేర్కొనఁబడినది.



**అవ:-** పిదప ''చాముండ'' అను సప్తమ మాతృక నభివర్ణించుచున్నాడు.

మూ॥ సఙ్కల్పరక్త కణపాన వివృద్ధశక్త్యా
జాగ్రత్ సమాధికలయేశ్వరి! తే విభూత్యా।
మూలాగ్ని చణ్డ శశిముణ్డ తనుత్రభేత్త్యా
చాముణ్డయాతనుషుదేవి! నకింకృతం స్యాత్. ॥ 18

ఈశ్వరివగు నో దేవి! సంకల్పములను రక్త బిందువులను గ్రోలుటచేత మిక్కిలి వృద్ధి నొందిన శక్తిగల జాగ్రద్దశయందగు సమాధియను కళచేత మూలాగ్నియను చండునియొక్కయు, శశియనే ముండుని యొక్కయు కవచభూతములగు గ్రంథులను భేదించునదియగు చాముండయను పేరు గల నీయొక్క విభూతి చేత మా శరీరములయందు చేయబడనిదేమున్నది?

**ప్రభ:-** సంకల్పములనఁగా; చితవృత్తి విశేషములు. ''సమ్యగాధీయతే మనోఽస్మిన్నితి సమాధిః'' అను వ్యుత్పత్తి వలన దేని యందు మనస్సు చక్కగా నుంచఁబడునో అది సమాధియని చెప్పఁబడును. చండుఁడనువాఁడును, ముండుడనువాఁడును, రాక్షసులు, మూలాగ్నియనఁగా కులకండమను పేరుగల మూలాధారమునందున్న యగ్ని.

**విశే:-** దేవీ మహత్మ్యమునందు చాముండాశక్తి, రక్త బీజాసురుని రుధిరమును పానము చేసినట్లును, చండ- ముండులను ఖండించినట్లును చెప్పఁబడియున్నది. ఆకథాంశమునకు సంబంధించిన యాధ్యాత్మిక తత్త్వము నీ మహాకవి యీ శ్లోకమున రూపకాపదేశమున నుద్ఘాటించున్నాఁడు.

అదెట్లనిన:- దుర్గాసప్తశతియందలి యష్టమాధ్యాయమున దేవికి 'చాముండ' అనునామ మెట్లులభించినదియు నిట్లు చెప్పఁబడినది.

శ్లో॥ యస్మాచ్చణ్డంచ ముణ్డంచ గృహీత్వా త్వముపాగతా
చాముణ్డేతి తతోలోకే ఖ్యాతాదేవి! భవిష్యసి ॥

(దేవీ! నీవు, చండుని, ముండుని నిగ్రహించుట వలన లోకమున నీవు 'చాముండ' అను పేరుగల దానవు కాఁగలవు)

మఱియు నవమాధ్యాయమున, రక్తబీజుఁడను నసురునిగూర్చి ప్రస్తావించునపుడు క్రిందితీరునఁ జెప్పఁబడినది.

పలాయనపరాన్ దృష్ట్వా దైత్యాన్ మాతృగణార్దితాన్
యోద్ధుమభ్యాయయౌ క్రుద్ధో రక్తబీజో మహాసురః॥
తస్యాహతస్య బహుధాశక్తి శూలాదిభిర్భువి
పపాత యోవైరక్తౌ ఘస్తేనాసఙ్ఖ్యతశోఽసురాః॥
తైశ్చాసురాసృక్సమ్భూతైరసురైః సకలం జగత్
వ్యాప్తమాసీత్తతోదేవా భయమాజగ్ముఠుత్తమమ్ ॥
తాన్ విషణ్ణాన్ సురాన్ దృష్ట్వా చణ్డికాప్రాహ సత్వరా
ఉవాచ కాళీం చాముణ్డే! విస్తీర్ణం వదనంకురు॥
మచ్ఛస్త్రపాత సమ్భూతాన్, రక్తబీజాన్మహాసురాత్।
రక్తబిందూ ప్రతీచ్ఛత్వం వక్త్రేణానేన వేగినా ॥

మాతృ - గణము చేత మర్దింపఁబడి పలాయనము చిత్తగింపనున్న దైత్యులను చూచి రక్తబీజుఁడను మహాసురుడు క్రుద్ధుఁడై యుద్ధమునకువచ్చెను...

శక్తి శూలాదుల చేత వధింపఁబడిన రక్తబీజుని యొక్క రక్త సందోహము బహు విధముల ప్రసరించెను తన్మూలమున నసంఖ్యాకులగు రాక్షసులు బయలువెడలిరి. మహాసుర రక్తసంభూతులగు నాయసురుల చేత జగత్తంతయు వ్యాపించుట వలన దేవత లత్యధికమగు భయమునొందిరి. విషణ్ణులగు నాదేవతలను జూచి యోదార్చి చండిక సత్వరయై కాళితో నిటనెను.



''చాముండా! నీనోరు విరివియగునట్లు తెరువుము. మచ్ఛస్త్రపాతమున రక్తబీజమహాసురుని నుండి, స్రవించుచున్న రక్తబిందువులను నీ నోటితో వడిగాఁద్రావుము.'' మీఁది (18వ) శ్లోకమున చాముండా విభూతి స్వరూపము. 'జాగ్రత్ సమాధికల' అని చెప్పఁబడినది.

జాగ్రద్దశయందే ఏకాగ్రధ్యాన రూపమును, సహజమును, అగు సమాధి సిద్ధించును. కాని సుషుప్తియందుఁగాని, అష్టాంగయోగ నిష్పాద్యమగు లయావస్థయందుఁగాని సిద్ధింపదు.

అజాగ్రత్ సమాధియను విచిత్రవిద్యయే చాముండా విభూతి స్వరూపమగుచున్నది. కాని ఆమెయొక్క శక్తి - సంకల్పముల నుపహరించుటవలన వృద్ధినొందుచున్నది. ఈ సంకల్పోప సంహరణమే - చాముండాకృతమగు రక్తబీజాసుర -రుధిర బిందుపానము. మూలాధారమునందలి అగ్నిని ప్రబోధించుటయే చండతనుత్రమును భేదించుట, యోగులు కాని వారియందు మూలాధారమునందలి యగ్ని - తమోధూమావృతమగుట వలన, అసురునివలె ప్రతికూల మగునది - చండము (తీవ్రము) అగుచుండును. కావుననే ఆమూలాగ్ని - చండుఁడని చెప్పఁబడినది. చండ - కవచభేదన మనఁగా, మూలాగ్ని యందలి గ్రంథులను భేదంచుట. గ్రంథి భేదనము చేతనేగదా! మూలాధారమునందలి యగ్ని - అవరణము లేకుండ ప్రజ్వలించును.

యోగి ప్రసిద్ధమగు సహస్రార (చక్రము) నందలి అమృతాంశు (చంద్రమండలమునకు ప్రావరణము (కప్పునది) అగు మనస్సే - ముండుఁడను అసురుడు కావున మనస్సు యొక్క - నిగ్రహమే - ముండ - కవచ భేదనము.

మనో నిగ్రహము చేతనే సహస్రార చక్రము నందలి అమృత కిరణఝురిని ఆస్వాదించి యోగి - అమృతయగునది!

ఇట్లు రక్తకణపాన – చండ – ముండ – కవచ భేదనరూపమగు సంకల్పోప సంహార – మూలాగ్ని ధూమావరణ – సహస్రావరణ – ప్రభేదములు – ఏ కళచేత నిర్వహింపఁబడుచున్నవో. అది – మహాశక్తియగు నుమాదేవి యొక్క చాముండా విభూతి అనుగహనమును, యోగిజనైక వేద్యమనునగు నంశము సంక్షేపమగు తీరున సమన్వయింపఁబడినదని యెఱుంగునది. ఈ శ్లోకము ఈ మహాకవి ప్రతిభను దెల్పుచున్నది.

**అవ:**- ఇట్లు సప్తమాతృకలను సంస్తుతించి, మహాశక్తియగుమాయ - స్థానభేదము వలన నాలుగు విధములగు ననుచున్నాఁడు.

మూ॥ త్వంలోకరాజ్ఞి ! పరమాత్మని 'మూలమాయా'
శక్రే సమస్త సురభర్తరి 'జాలమాయా'
ఛాయేశ్వరా న్తర 'పుమాత్మని' 'యోగమాయా'
సంసారసక్తహృదయేష్వసి 'పాశమాయా'. 19

లోక రాజ్ఞీ! నీవు పరమాత్మయందు మూలమాయవు. సురేశ్వరుఁడగు శక్రునియందు జాలమాయవు. ఛాయేశ్వరుఁడగు సూర్యుని మండలమునందున్న పురుషుఁడగు విష్ణునియందు యోగమాయవు. సంసారసక్తులగు మనుష్యుల హృదయములయందు పాశమాయవు.

ప్రభ:- ఇంద్రజాలము లోక ప్రసిద్ధము. అదియే జాలమాయయని యిచటఁ జెప్పఁబడినది.

''రూపం రూపం ప్రతిరూపో బభూవ
తదస్యరూపం ప్రతిచక్షణాయ
ఇన్ద్రో మాయాభిః పురురూప ఈయతే'' బృహ **2-5-19**

ఆ పరమేశ్వరుఁడు ఈయాత్మ స్వరూపమును (తన స్వరూపమును) చెప్పుట కొఱకు నామరూపములను వ్యాకరించి, మనుష్యాది జాతులయందు



ప్రతిరూపమునకును అను రూపమగు వేఱొకరూపము గలవాఁడు (మాతాపితరులకు సమానమగు రూపము గలవాఁడు) ఆయెను. (పరమేశ్వరుఁడగు) ఇంద్రుఁడు మాయల చేత (పారమార్థికములు కాని, నామరూప భూతకృత మిధ్యాభిమానముల చేత గాని ప్రజ్ఞలచేతఁ గాని) అనేక రూపములు గలవాఁడగుచున్నాఁడు. ( ఆ యింద్రుఁడు ఏకరూపుఁడైనను అవిద్యా ప్రజ్ఞల చేత బహురూపుఁడగుచున్నాఁడని భావము).

విష్ణువునకు యోగమాయ కలదనునంశము దుర్గాసప్తశతియందును, గీతల యందును ప్రసిద్ధము. పాశమాయయనఁగా బంధజననియగు మాయ. సంసారమనగా జననమరణరూపము. పరమాత్మకు కేవలమగు శక్తియు పరమేశ్వరుఁడగు ఇంద్రునకు విద్యా పేక్షమగుశక్తియు, బ్రహ్మాండ పితృ- భానుమండల మధ్యవర్తియగు విష్ణునకు యోగ శక్తియు, సంసారికి ఆధ్యాత్మిక శక్తియునగు మాయలు నాల్గును గూడ ఒక్కటెయేయగు పరమేశ్వరి రూపము లేయని తాత్పర్యము.

**అవ:**- ఇట్లు క్రియాధర్మమున చతుర్విధయు మాయాపదవాచ్యయునగు మహాశక్తిని స్తుతించి, సర్వక్రియాధారభూతయు, సముపసంహృత స్వాత్మవిలాసయు, స్వప్తయు, సమాహిత సర్వసామర్థ్యయు, లయస్వరూపయు, నిద్రాపద వాచ్యయునగు ఆ మహాశక్తిని ప్రస్తుతించుచున్నాఁడు.

మూ॥ త్వం భూతభర్తరి భవస్యనుభూతి నిద్రా
సోమస్యపాతరి బిడౌజసి మోదనిద్రా
సప్తాశ్వ బిమ్బపురుషాత్మని యోగనిద్రా
సంసారమగ్న హృదయేష్వసి మోహనిద్రా. 20

నీవు భూతేశ్వరుఁడగు నీశ్వరునియందున్న అనుభూతి నిద్రవు. సోమపాయియగు నింద్రునియందు మోద నిద్రవు. సూర్యబింబ పురుషాత్ముండగు

విష్ణునియందు యోగనిద్రవు. సంసారమగ్నులగు ప్రజల హృదయముల యందు మోహనిద్రవు.

**ప్రభ:-** భూతములు = ప్రాణులు. భూతభర్త = ప్రాణులకధిపతి. అనుభూతి నిద్రయనఁగా అనుభవరూపిణియగు నిద్ర. పవమానమను పేరుగలరసము – సోమమని చెప్పఁడును. మోదనిద్రయనగా, మోదరూపిణియగు ఆనంద నిద్ర, యజ్ఞభోక్తయగు నింద్రునకు సోమపానము ప్రసిద్ధము. మోహనిద్రయనఁగా మోహాత్మికయగు నిద్ర.

**విశే:-** ఇచట నీయంశము నెఱుంగునది. నామరూపాధ్యాత్మికమగు నీజగత్తు సృష్టికిముందు, నామరూపముల చేత వ్యాకృతముకాని పరబ్రహ్మమగు సత్యేయగుచుండెను. అని శ్రుతులయందు గానము చేయఁబడినది. ''అసద్ వా ఇద మగ్ర ఆసీత్'' సృష్టికి ముందీజగత్తంతయు అసత్తేయగుచుండెను. '' ఇదమేవాసత్ తమః'' ఈయసత్తే తమస్సు. అని యొక మంత్రము చెప్పుచున్నది. సర్వాభావ రూపమగు నసత్తే తమస్సని చెప్పఁబడినది.

స్వాస్థ్యానుభూతి రూపమును, సర్వలయాత్మకమును, అగు నీమూల తమస్సు 'నిద్ర' అని చెప్పఁబడుచున్నది. ఈ మహాశక్తినే తాంత్రికులు తామసియగు కాలరాత్రియని గానము చేయుదురు.

ఒక్కటియేయగు ఆయీ నిద్ర, భూతేశ్వరునియందు స్వస్థానుభూతిగను, యింద్రునియందు – ఆనందలహరిగను, విష్ణునియందు యోగసంపత్తిగను, సంసారియగు పురుషునియందు మోహశక్తిగను అగుచున్నదని తాత్పర్యము.

**అవ:-** ఇప్పుడు – దేవీ మహాత్మ్య చరిత్ర – త్రయపాదితములగు దేవీ మూర్తులు మూడింటియందును – అద్యయగు కాళిని ప్రస్తుతించుచున్నాఁడు.



మూ॥ విష్ణుశ్చకార మధుకైటభనాశనం య
న్ముక్తః సహస్రదల సమ్భవ సంస్తుతా సా।
కాలీ ఘనాఞ్జన నిభప్రభదేహశాలి
న్యుగ్రాతవామ్బ భువనేశ్వరి! కోఽపి భాగః॥ 21

భువనేశ్వరివగు నంబా! ఏ యోగ నిద్రనుండి మేల్కొనిన విష్ణువు మధుకైటభులను రాక్షసులను నశింపఁజేసెనో, పద్మగర్భ సంస్తుతయు, దట్టమగు కాటుకను బోలిన కాంతిగల దేహమున నొప్పుచున్నదియు, ఉగ్రయునగు; ఆ (యోగనిద్రయేయగు) కాళీమూర్తి నీకొకానొక భాగమగుచున్నది.

**ప్రభ:-** ఉగ్రయనుపదమునకును నుద్గీర్ణ బలయనునర్థము వ్యాఖ్యాతచే నిర్దేశింపఁబడినది. భాగమనఁగా కలావిశేషము. ఈయంశమున నుపయుక్తమగు సప్తశతీ ప్రథమాధ్యాయమునందున్న కొన్ని శ్లోకముల యర్థమిచట నెఱుఁగవలసియున్నది. కావున వాని యర్థము మాత్రము క్రిందవ్రాయఁబడుచున్నది. కల్పాంతమునందు ఈ జగత్తంతయు – సముద్రముగాఁ జేయబడియుండునపుడు భగవంతుఁడును ప్రభువును అగు విష్ణువు యోగనిద్ర నాశ్రయించి శేషునియందుండెను. అప్పుడు విష్ణుకర్ణమలోద్భూతులును భయంకరులును ప్రసిద్ధులును' అగు మధు – కైటభులను రాక్షసులిద్దఱు బ్రహ్మదేవుని వధించుట కుద్యుక్తులయిరి. ప్రజాపతియగు నా బ్రహ్మ, విష్ణుని నాభికమలము నందుండెను. అతఁడే కాగ్రహృదయుఁడై, ఆ యోగనిద్రను స్తుతించెను.

తామసియగు నాయోగనిద్ర యిట్లు బ్రహ్మచే స్తుతింపబడియెను. ఆయోగ నిద్రచేత విడువఁబడిన జగన్నాథుఁడగు జనార్దనుఁడపుడు మేల్కొనిలేచెను. కావుననే మీఁది శ్లోకమున 'యన్ముక్తః' అను పదము 'యయా యోగనిద్రయా ముక్తః' అని వ్యాఖ్యానింపఁబడియెను.

**అవ:-** ఇట్లు – మధు – కైటభదమనియగు కాళిని స్తుతించి, ద్వితీయ చరిత దేవతయు మహిషాసుర మర్దినియు దేవీమూర్తియునగు లక్ష్మిని ప్రస్తుతించున్నాఁడు.

మూ॥ విద్యుత్ ప్రభామయ మధృష్య తమం ద్విషద్భి
శ్చణ్డ ప్రచణ్డ మఖిల క్షయకార్యశక్తమ్।
యత్తే సవిత్రి! మహిషస్యవధేస్వరూపం
తచ్చిన్తనాదిహ నరస్య న పాపభీతిః॥ 22

జననీ! అఖిలక్షయకార్య శక్తియుక్తమును, చండప్రచండమును, శత్రువుల చేత అనభిగమ్యతమమును; విద్యుత్ ప్రభామయమును, మహిషాసుర వధోద్యుక్తమునునగు నీ స్వరూపము ధ్యానించు నరునకు పాపభీతికలుగదు.

**ప్రభ:-** చండ ప్రచండమనగా నతితీవ్రమని యర్థము. అనభిగమ్యతమమనఁగా అత్యంత దుర్గమమని యర్థము. మహిషాసుర వధోద్యుక్తమును, దుర్ధర్శమును, వైద్యుత జ్యోతిర్మయమునగు నీజ్యోతిర్మయశరీరమును ధ్యానించుటచేత సర్వతమోరూప పాప – ధ్వంసమగుననుటయందాశ్చర్యము లేదని తాత్పర్యము.

**అవ:-** తరువాత తృతీయ చరిత దేవతయు శుంభధమనియునగు సరస్వతీ మూర్తిని స్తుతించున్నాఁడు.

మూ॥ శుమ్భం నిశుమ్భ మపియా జగదేకవీరౌ
శూలాగ్రశా స్తమహసౌ మహతీచకార।
సాకౌశికీ భవతి కాశయాశాః కృశోద
ర్యాత్మాఙ్గజా తవమహేశ్వరి! కశ్చిదంశః॥ 23

మహేశ్వరీ! ఏ నీమహామూర్తి జగదేకవీరులగు శుంభుని నిశుంభునిగూడ శూలాయుధాగ్రమున నిర్వీర్యముగాఁ జేయఁడిన ప్రతాపము గలవారినిగాఁ జేసెనో ఆ మహామూర్తి కాశపుష్పసదృశమగు కీర్తి గలదియు, నీ శరీరమునుండి సంభవించినదియు, కృశోదరియునగు కౌశికీదేవియై యున్నది. కౌశికీనామ్నియగు నాదేవీ మూర్తి నీకొకానొక యంశవిశేషము.



**ప్రభ:-** కౌశికియనఁగా దుర్గయే. ఈ యంశమొకచోట నిట్లుఁజెప్పబడినది. ''కౌశికీ'' నామసాదుర్గా హన్త్రీశుమ్భనిశుమ్భయోః'' శుంభ – నిశుంభ హన్త్రియగు నాదుర్గయే కౌశికి. ఇప్పుడు – ఇష్టదేవతయగు మహాశక్తిని, తత్ప్రసాదముకొఱకు శరణాగతిముఖమున కవి యాచించుచున్నాఁడు.

మూ॥ మాయే! శివే! శ్రితవిపద్వినిహన్త్రి! మాతః!
పశ్య ప్రసాదభరశీతలయా దృశామామ్
ఏషోఽహమాత్మజకలత్ర సుహృత్ సమేతో
దేవి! త్వదీయచరణం శరణం గతోఽస్మి. 24

కపటనాటక సూత్రభర్త్రివి, శ్రితవిపద్ వినిహంత్రివి, మంగళస్వ రూపిణివి అగుమాతా! ప్రసాదభరశీతల మగు దృష్టిని నా యెడఁ బ్రసరింపుము. దేవి! ఈ నేను మదాశ్రిత పుత్ర – దారమిత్రులతోఁగూడ త్వదీయ చరణ శరణుఁడనై యున్నాఁడను.

**ప్రభ:-** శ్రిత విపద్ వినిహంత్రివనఁగా, ఆశ్రితుల యాపదలను తొలగించుదానవని యర్థము. ప్రసాదమన అనుగ్రహము. 'చరణశరణుఁడనై యున్నాఁడను'' అనగా, ప్రసన్నుఁడనగుచున్నాడనని యర్థము.

**విశే:-** భగవతియగు దుర్గ – అనిష్టమును తొలగించి, అభీష్టమును కలిగించుచు నిజచరణాశ్రితుఁడగు జనుని అనుగ్రహించుటయే కాక, వానిని తదితరుల కాశ్రయునిగఁగూడ నొనర్చునుగావున నా మెకుఁగల పరమ కారుణికత్వ – వదాన్యత్వములు, ప్రసిద్ధము లేయగుచున్నవి. అదెట్లనిన, దుర్గాసప్తశతియందు ''త్వామాశ్రితాహ్య శ్రయతాంప్రయాన్తి'' (నిన్నాశ్రయించిన ప్రాణులు, తదితరుల కాశ్రయులగు చుందురుగదా!) అని చెప్పఁబడినది.

**అవ:-** ఇట్లు వంసతతిల కావృత్త నిబద్ధములగు స్తోత్రములచేత – దేవీ ప్రీణనమును, సజ్జనగణానందలాభమును, ప్రార్థించుచు స్తబకము నుపసంహరించుచున్నాడు.

మూ॥ ధిన్వన్తు కోమలపదాః శివవల్లభాయాః
చేతో వన స్తతిలకాః కవికుఞ్జరస్య
అనన్వయన్తు చ పదాశ్రిత సాధుసఙ్ఘం
కష్టంవిధూయ సకలంచ విధాయచేష్టమ్. 25

కవికుంజరుడగు గణపతి రచించిన లలితపదములగు వసంత తిలకములు శివవల్లభయగు ఉమ హృదయమును రంజింపఁజేయునుగాత! మఱియు కష్టమును తొలఁగించి యిష్టమును కలిగించి త్వదీయపదాశ్రితమగు సాధుసంఘమును ఆనందింపఁజేయునుగాత!

ప్రభ:-కవికుంజరుఁడు = కవిశ్రేష్ఠుఁడు, మదీయములగు వసంత తిలకాస్తుతులు – దేవీ ప్రీణనమును, సాధుజనానందమును సంఘటించుఁగావు తమని తాత్పర్యము.

ఇది – సవ్యాఖ్యమగు సప్తమ స్తబకము.
ఓమ్ తత్, సత్.

* * * *



ఓం నమోభగవతే శ్రీరమణాయ

# ఉమాసహస్రము

## (ద్వితీయ శతకమున – చతుర్థ స్తబకము)

## అష్టమ స్తబకము

మూ॥ తమసా మభితోహన్తా చణ్డికాహాస వాసరః
సతాం హృదయరాజీవ వికాసాయ ప్రకల్పతామ్.॥ 1

సర్వమునుండియు (సాకల్యముగా) తమములను తొలఁగించునదియగు చండికాహాస – వాసరము – సజ్జనహృదయ – రాజీవమును వికసింపఁ జేయునుగాత!

ప్రభ:- మూలమునందలి ''అభితః'' అను పదమునకు '' సాకల్యముగ'' అనిగాని సర్వమునుండియు, అనిగాని అర్థమును జెప్పనగును.

హాస – వాసరము అనఁగా ''చిరునవ్వు'' అను ''హృదయ – రాజీవము'' అనఁగా హృదయమను పద్మము, పగలు – పద్మమును, వికసింపఁజేయును. హాసము హృదయము నున్మీలింపజేయును. తమమనగా అజ్ఞానము – లేక అంధకారము. సర్వమునుండియు తమములను తొలగించుట ఉభయగతమగు నర్థశ్లేషము.

ఇందు విషయియగు వాసరము యొక్క రూపము చేత విషయమగు హాసమునకు రంజనము కలిగినది. కావున నిదిరూపకాలంకారమగుచున్నది.

వాసర సాపేక్షమగు రాజీవ వికాసమును, హాససాపేక్షమగు హృదయోన్మీలనము అను వస్తువు – మీఁదిరూపకము చేత అనుప్రాణితము –